విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com కర్నూలు, బుధవారం 10, సెప్టెంబరు 2025

చంద్రబాబూ.. మీది దగా ప్రభుత్వం కాదా..?

- సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభకు వస్తున్న సీఎంకు సీపీఐ బహిరంగ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలను అడుగడుగున దగా చేసి సూపర్ సిక్స్-సూపర్ హిట్ పేరుతో అనంతపురంలో బహిరంగ సభ నిర్వహిస్తుండటం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ విమర్శించింది. బుధవారం అనంతపురంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్- సూపర్ హిట్ పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్న సందర్భంలో అనంతపురం జిల్లా సీపీఐ సమితి మంగళవారం బహిరంగ లేఖ విడుదల చేసింది. సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, సహాయ కార్యదర్శులు సి. మల్లికార్జున, జె.రాజారెడ్డిలు విలేకరుల సమావేశం నిర్వహించి కూటమి ప్రభుత్వ వైఫల్యం ఎండగట్టారు. పాళ్యం నారాయణస్వామి మాట్లాడుతూ గడిచిన ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మరోసారి దగా చేయడానికి బహిరంగ సభ పెడుతున్నారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు ఇచ్చిన భరోసా నీరుగారి పోయిందన్నారు. దీపం పథకం కొందరికే లబ్ధి చేకూరిందని, తల్లికి వందనం పేరుతో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను దగా చేశారని కోత పెట్టి మరి లబ్ధిదారుల సంఖ్య తగ్గించి అందించారని గుర్తు చేశారు. నిబంధనల పేరుతో స్త్రీ శక్తి పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయకపోయిన కూటమి ప్రభుత్వానికి సక్సెస్ పేరుతో బహిరంగ సభ పెట్టే హక్కు లేదన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో స్వల్ప డబ్బులు ఇచ్చి లక్షలాది మంది రైతుల ఉసురు పోసుకున్నారని విమర్శించారు. నెల నెలా రూ.1500 రూపాయలు 18 ఏళ్ల దాటిన ప్రతి మహిళకు ఇస్తామని.. నమ్మబలికిన చంద్రబాబు అధికారంలోకి రాగానే మిన్నకుండిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర పేరుతో ఊరురా తిరిగి ఏటా 4 లక్షల ఉద్యోగాలు, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కనీసం నిరుద్యోగ భృతి కూడా ఇవ్వకుండా కాలయాపన ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు . పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలం ఇచ్చి రూ.4 లక్షల యూనిట్ ధరతో పక్కాఇంటి నిర్మాణం చేయిస్తామని నమ్మబలికిన కూటమి పెద్దలు ఎందుకు గృహ నిర్మాణాన్ని నీరుగార్చారని ప్రశ్నించారు. టీడ్కో ఇళ్ల లబ్ధిదారులకు నేటికీ సొంతింటి కల నెరవేర్చలేకపోయిన అసమర్థ ప్రభుత్వం కూటమి నేతలకే దక్కిందని మండిపడ్డారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టుల మోక్షం ఎప్పుడు అని నిలదీశారు. హంద్రీనీవా పథకం ద్వారా బీటీపి, కుందుర్పి బ్రాంచ్ కెనాల్, పేరూరు డ్యామ్ కు నీళ్లు ఎప్పుడు తరలిస్తారని ప్రశ్నించారు.

అన్ని సాధించినట్లు 164 మంది ఎమ్మెల్యేలు అనంతపురం కేంద్రంలో విజయోత్సవ సభ నిర్వహించడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. రైతులకు యూరియా సకాలంలో అందించని అసమర్థ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. మరో జిల్లా సహాయ కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ 156 హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలు చేసి, వాటి ఫలాలు ప్రజలకు అందించలేక పోయిందన్నారు. ఉచిత బస్సు, సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఆటో కార్మికులకు వాహన మిత్ర ఇవన్నీ అమలు చేయలేదని విశాఖ ఉక్కు ప్రైవేటు పరం కాకుండా అడ్డుకట్ట వేయలేదని విమర్శించారు. విభజన హామీలు అమలుపై కేంద్ర ప్రభుత్వంపై ఎందుకు పోరాటం చేయలేదని ముఖ్యమంత్రిని నిలదీశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.కేశవరెడ్డి, ఎన్.శ్రీరాములు కార్యవర్గ సభ్యులు బి.రమణ, జి.సంతోష్ కుమార్, సి.రాజేష్‌గౌడ్, వై.ఎల్.రామాంజనేయులు, డీ.చెన్నపయాదవ్, సీపీఐ నగర సహాయ కార్యదర్శి వి.కృష్ణుడు, ఏ.ఐ.వై.ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఏ.దనుజయ, రైతు సంఘం నాయకులు మధు, జిల్లా సమితి సభ్యులు దుర్గ ప్రసాదులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతులకు పడిగాపులు తప్పవా ?

విశాలాంధ్ర-కణేకల్లు : కనేకల్‌లోని ఎరువుల కోసం యూరియా కోసం రైతులు ప్రతిరోజు సొసైటీల చుట్టూ ఎరువుల దుకాణాలు చుట్టూ రైతులు ప్రదర్శనలు చేస్తూ అష్ట కష్టాలు పడుతున్నారని.. సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి సంజీవప్ప ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సంజీవప్ప విలేకరులతో మాట్లాడుతూ కొరత పేరుతో యూరియా బ్లాక్ మార్కెట్కు తరలిపోకుండా విజిలెన్స్ అధికారులను చర్యలు తీసుకోవాలని.. యూరియా సరఫరాలో సమస్య రాకుండా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. మార్కెట్ వద్ద వ్యవసాయ అధికారులు నిఘా ఉంచాలన్నారు, జిల్లా నుంచి నియోజకవర్గాలకు పంపే యూరియా లోడ్లు మండల వాసులకు ఏమాత్రం సరిపోదని, యూరియా వచ్చిన కొన్ని గంటల్లోనే అమ్ముడుపోతున్నదని అన్నారు. ప్రైవేట్ వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తుండడం పురుగుల మందులు కొంటేనే యూరియా విక్రయిస్తామని నిబంధన విధిస్తుండటంతో రైతులు అయోమయంలో పడుతున్నారన్నారు. అధికారులు మాత్రం ఎరువుల కొరత లేదని చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఎవరైతే అక్రమ దారుల్లో ఇతర రాష్ట్రాలకు తరలిస్తారో వారి పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని, రైతులకు అన్యాయం చేస్తున్న దుకాణాలపై చర్యలతో లైసెన్సులు రద్దు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు, వర్షాలు వస్తున్నాయి.. రైతులు పంటలు పెట్టుకునేందుకు సంతోషంగా పని చేసుకునే అధికారులు ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని, ఈ యూరియా సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని తాసిల్దార్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం డి సంజీవప్ప, కనేకల్ మండల కార్యదర్శి ఎం గౌస్ పీర్, ముల్లా శర్మస్ వలి, హనుమేష్, ఇతర సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి జాగా అందే వరకు పోరాటం ఆగదు..

- నియోజవర్గ కార్యదర్శి తలారి నారాయస్వామి
- సచివాలయ ముందు ధర్నా..

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: బుక్కరాయసముద్రం మండల గోవిందం పల్లి పంచాయతీ పరిధిలోని అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం గోవిందంపల్లి పంచాయతీ సచివాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శింగనమల నియోజకవర్గ కార్యదర్శి తలారి నారాయణస్వామి హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గత ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ, నగర ,ప్రాంతాల్లో 2 సెంట్ల ఉంటి స్థలంతో పాటు గృహ నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ నేటి వరకు అమలుకు నోచుకోలేదని, ప్రస్తుతం అనంతపురం జిల్లాలో జరుగుతున్న సూపర్ హిట్ మహాసభ అనంతరం పేదల పట్ల శ్రద్ధ వహించాలని సీఎంను కోరారు. కూటమి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడి నప్పటి నుండి జిల్లా కలెక్టరు, రెవిన్యూ డివిజన్, తహసీల్దారు కార్యాలయాల ముందు ధర్నాలు, నిరసనలు సీపీఐ ఆధ్వర్యంలో చేపడుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టడం సిగ్గుచేటన్నారు. పేదల న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యో వరకు సీపీఐ పోరాటం సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో బుక్కరాయసముద్రం మండల సహాయ కార్యదర్శి బి.రామాంజనేయులు, వ్యవసాయ సంఘం నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.రాము, రాఘవేంద్ర కాలనీ శాఖ సెక్రెటరీ సుంకన్న, సహాయ కార్యదర్శులు లక్ష్మీనారాయణ,చందు, టమోటా రామంజి, బాలాజీ, ప్రసాద్, వీర, శివమ్మ, లాయమ్మ,హాజిబి, మహిళా సంఘం కార్యదర్శి బి.నాగరత్న, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాల్సిందే..

విశాలాంధ్ర-కణేకల్లు: మండలంలోని అర్హులైన ప్రతి ఒక్క పేదకు ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో మంగళ వారం కనేకల్ తహసీల్దార్ ఆఫీస్ ముందు ధర్నా రెండవ రోజు చేపట్టారు. ముఖ్యఅతిథిగా రాయదుర్గం నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి నాగార్జున హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇంటి స్థలాలటు గృహ నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాయదుర్గం నియోజకవర్గం సిపిఐ నాయకులు నాగార్జున, మండల కార్యదర్శి ఎమ్.గౌస్ పీర్, ముల్లా సర్మస్వలి, హనుమేష్, గురుగప్ప, ఇతర సిపిఐ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు సక్రమంగా అమలు కాలేదు

విశాలాంధ్ర-శింగనమల: శింగనమల నియోజకవర్గం పుట్లూరు మండల కేంద్రంలో సూపర్ సిక్స్ హామీలు సక్రమంగా అమలు చేయలేదని, సూపర్ సిక్స్ సూపర్ హిట్ పేరుతో బహిరంగ సభలు పెట్టి ప్రజల సొమ్ము దుర్వినియోగం చేయడం దారుణమని, సిపిఐ పుత్తూరు మండల కార్యదర్శి పెద్దయ్య ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు సంపూర్ణంగా ఎక్కడా అమలు జరగలేదని, కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టడానికి బహిరంగ సభలో ఏర్పాటు చేస్తున్నారని, అమలు కాని పథకాలు అమ్మ ఒడి, తల్లికి వందనం పథకం కింద విద్యార్థిని విద్యార్థులకు, 15000 రూపాయలు వారి అకౌంట్లో ఫస్ట్ ఇయర్ పిల్లలకు ఇంతవరకు చాలామందికి వారి ఖాతాలలో డబ్బులు జమ కాలేదన్నారు. ఉచిత గ్యాస్ సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి మొదటి సిలిండరుకు డబ్బులు వారి ఖాతాలలో జమ కూడా కాలేదన్నారు. మహిళలకు భరోసా పేరుతో 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల మహిళలకు ప్రతినెలా 1500 రూపాయలు ఇస్తామని సూపర్ సిక్స్ హామీలలో చెప్పారని, మహిళలకు ప్రతి నెలా రూ.1500 రూపాయలు ఎక్కడ ఇచ్చారో చూపాలన్నారు. చదువుకున్న నిరుద్యోగులకినిరుద్యోగ భృతి ప్రతి నెల 3000 రూపాయలు ఎక్కడ ఇచ్చారో చెప్పాలన్నారు. పల్లెల్లో3,సెంట్లు, పట్టణాలల్లో 2,సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి రూ.4 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇస్తామని చెప్పి ఇంతవరకు ఈ వాగ్దానాన్ని ఎక్కడ అమలు చేశారో చెప్పాలని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 14 నెలలు పూర్తి చేసుకున్నా కూడా చంద్రన్న బీమా పథకాన్ని అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలోమండల సహాయ కార్యదర్శులు, రాజు, బాలు, ఓబుళపతి,నడిపి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో లోటుపాట్లు తలెత్తరాదు..

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

విశాలాంధ్ర-అనంతపురం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం జిల్లా పర్యటన నేపథ్యంలో మొబిలైజేషన్ ప్రణాళిక శక్తివంతంగా, పకడ్బందీగా చేపట్టా లని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో డిఆర్డిఏ, డ్వామా శాఖల అధికారులు, సిబ్బందితో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభలో పాల్గొనేందుకు అత్యంత భారీస్థాయిలో ప్రజలు వస్తున్న నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా ప్రణాళికను గూగుల్ షీట్‌లో ఎక్కించాలన్నారు. మధ్యాహ్నం నుంచి ఫోన్ చేసి మీ గ్రామాలకు బస్సు చేరిందా, బుధవారం ఎన్ని గంటలకు బయలుదేరుతారు, కార్యక్రమం వద్ద జాగ్రత్తగా ప్రజలను దింపడం, మధ్యాహ్నానికి చేరుకోవడం తిరిగి ఎప్పటికి వారి స్వస్థలాలకు వెళ్తారు అనే వివరాలను ముందు గానే తెలుసుకోవాలన్నారు. మండలాల వారిగా వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి అందులో ఏపీఎం, ఏపీవోలు, కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బందిని యాడ్ చేసి ఎప్పటికప్పుడు మానిటర్ చేసేలా చూడాలని, ఈ విషయమై డ్వామా పిడి పూర్తిగా మానిటర్ చేయాలన్నారు. ఇందులో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఏ.మలోల, డిఆర్డిఏ పిడి శైలజ, డ్వామా పీడీ సలీం బాషా పాల్గొన్నారు.

నేడు ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు అడ్డంకులు ఉండవు

విశాలాంధ్ర-అనంతపురం: ఈనెల 10వ తేదీన అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ నేపథ్యంలో అన్ని ఆసుపత్రులు యథాస్థితిలో ఉంటాయని, ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు అడ్డంకులు ఉండవని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. ఆసుపత్రులకు వెళ్లి వచ్చే రూట్లలో ఎలాంటి మార్పులు ఉండవన్నారు. రోజువారీగా ఆసుపత్రులకు వెళ్లి మందులు తీసుకోవచ్చని తెలిపారు. విజయోత్సవ సభ ఎన్నికల్లో మెడికల్ క్యాంపులను ఏర్పాటు, అత్యవసర సేవలు సంబంధించిన సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ముఖ్యమంత్రి వస్తే విద్యా సంస్థలకు సెలవులా..?

- అమ్మ ఒడి రూ.15 వేలు ఇస్తామని రూ.13 వేలు ఇవ్వడం సూపర్ హిట్టా..??
- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి

విశాలాంధ్ర-అనంతపురం రూరల్: సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ రేపు జరుగుతున్న విజయోత్సవ సందర్భంగా విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి ఖండించారు... సూపర్ సిక్స్ పథకంలో ఎన్నికల మేనిఫెస్టోలో మీరు ఇచ్చిన హామీలు తూతూ మంత్రంగా అమలు చేసి ఏదో రాష్ట్రాన్ని బాగు చేశాం.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేశాం బ్రహ్మాండంగా మా పరిపాలన ఉంది అన్నట్టు సమావేశం నిర్వహిస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు.. ఇప్పటికే రాష్ట్రం అప్పుల ఊబిలో ఉంది హామీలు అమలు చేయలేకపోతు న్నామని చాలా సభలలో తొక్కుతున్న ముఖ్యమంత్రి ఈరోజు అనంతపురం జిల్లాలో సూపర్ హిట్ సభకు సుమారు మూడు లక్షల మంది జనాలను కలపడంతో కొన్ని కోట్ల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని పేర్కొన్నారు ఈ డబ్బులను పేద ప్రజల కోసం లేదంటే మీరు ఎన్నికలలో ఇచ్చేటువంటి వాగ్దానంలో ఉన్న హామీల కోసం ఉపయోగిస్తే బాగుంటుందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అమ్మఒడి రూ.13 వేల రూపాయలు ఇచ్చారని ప్రతి మీటింగులో లబోదిబోమని కొట్టుకున్న ముఖ్యమంత్రి తాను అధికారంలోకి వచ్చిన తరువాత ఎందుకు 2000 కోత విధించారని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా రూ. 3వేల నిరుద్యోగ భృతి ఎవరికి ఇచ్చారని ప్రశ్నించారు.. 18 ఏళ్ల నుంచి 51 సంవత్సరాల వరకు ఉన్న మహిళలకు నెలకు 1500 రూపాయలు రాష్ట్రంలో ఏ మహిళకు అందించారని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీల పథకంలో తూతూ మంత్రంగా ఒకటో రెండో అమలు చేసి ఆరు పథకాలు సక్రమంగా అమలు చేశామని గొప్పలు చెప్పుకోవడం కాదన్నారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ తగదన్నారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని.. ఫీజు రియంబర్స్మెంట్ పథకం 6400 కోట్లు విడుదల చేస్తామని ఇంటర్ పూర్తిచేసుకుని నాలుగు ఐదు నెలల గడుస్తున్నా నేటికీ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించకపోవడంతో రాబోయే కాలంలో డిగ్రీ విద్యాసంస్థలు మూసివేసి ప్రైవేట్ పరం చేసే దానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. జనాల సమీకరణ కోసం విద్యాసంస్థల బస్సులను ఉపయోగించుకొని విద్యార్థులకు రేపటి రోజున సెలవు ప్రకటించడం దీనికి సంకేతమని ప్రశ్నించారు. ఒక్కరోజు విద్యాసంస్థ నడపకపోతే సిలబస్ పూర్తికాదు అది పూర్తి కాదు ఇది పూర్తి కాదు అని మాటలు చెప్పే ముఖ్యమంత్రి కోసం రేపు విద్యాసంస్థలకు సెలవు ఇవ్వడం సరైనది కాదని మండిపడ్డారు.. రేపు జరిగే సమావేశంలో అయినా విద్యార్థులకు నిరుద్యోగులకు హామీలు అమలు చేయాలని, విద్యాసంస్థలలోకి విద్యార్థి సంఘాల అనుమతి నిషేధ ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

చంద్రన్న బీమా పథకం ఎక్కడ

విశాలాంధ్ర-నార్పల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 14 నెలలు పూర్తి చేసుకున్న చంద్రన్న బీమా పథకాన్ని అమలు చేయలేదని సిపిఐ మండల కార్యదర్శి సాకే గంగాధర్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం చెప్పిన వాగ్దానాలు సక్రమంగా అమలు చేయకపోయినా సూపర్ సిక్స్- సూపర్ హిట్ విజయోత్సవ సభ పెట్టుకోవడం ఎంతవర సమంజసమని సిపిఐ పార్టీ తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కావున బాబు చెప్పిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి చాపల రామాంజి. మరోసారి కార్యదర్శి .సాకే సుధాకర . వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్ద పెద్దయ్య .రైతు సంఘం మండల కార్యదర్శి లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూరియాను బ్లాక్ మార్కెట్‌కు అమ్ముకుంటున్న కూటమి ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే వైసీపీ సమన్వయకర్త వై.వెంకట్రాంరెడ్డి
- వైసీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు

విశాలాంధ్ర-గుంతకల్లు: రైతులకు ఇచ్చే ఎరువులను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకొని రైతులను మోసం చేస్తున్నఇలాంటి దుర్మార్గమైన కూటమి ప్రభుత్వాన్ని మేము ఎప్పుడూ చూడలేదని మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. వైసీపీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం ముఖ్య అతిథి ఆధ్వర్యంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే వెంకట్రాం రెడ్డి క్యాంప్ కార్యాలయం నుంచి ఆర్డిఓ ఆఫీస్ వరకు ర్యాలీగా బయలుదేరి ఆర్డిఓ ఆఫీస్ ముందు ధర్నా చేపట్టారు. ముందుగా ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో రైతులకు గిట్టు బాటు ధరలు, ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, ఉచిత ఇన్సూరెన్స్ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించిందన్నారు.

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులే వారి సొంత డబ్బులతో ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లిస్తున్నారన్నారు. ఎరువులు బ్లాక్ మార్కెట్ తరలుతున్నాయని మండిపడ్డారు. ప్రతి రైతుకు ఎరువులు అందుబాటులో ఉంచాలని, పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని ప్రతి రైతుకు అవసరమై నంత యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుంతకల్ మున్సిపల్ చైర్మన్ భవాని, జిల్లా ఉపాధ్యక్షులు నైరుతిరెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగాది లింగేశ్వర బాబు, గుంతకల్ పట్టణ కన్వీనర్ ఖలీల్, రూరల్ కన్వీనర్ వాల్మీకి రాము, నియోజకవర్గం రైతు సంఘం కన్వీనర్ బాబురావు, గుంతకల్ రైతు సంఘం నాయకులు ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గంలోని కౌన్సిలర్లు, మండలాల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు గుత్తి మున్సిపల్ వైస్ చైర్మన్ వరలక్ష్మి, గుత్తి పట్టణ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్, గుత్తి కౌన్సిలర్లు సర్పంచులు ఎంపీటీసీలు, వార్డు మెంబెర్స్, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

రైతుల కష్టాలను తీర్చాలి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: రైతుల కష్టాలను తక్షణమే పరిష్కరించాలని.. యూరియా కష్టాలను పరిష్కరించేందుకు మంగళవారం వైసీపీ సమన్వయ కర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. కార్యక్రమానికి రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, ఇతర నాయకులు హాజరై పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందజేశారు. యూరియాతో పాటు అన్ని రకాల ఎరువులను వెంటనే అందజేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఏ ఒక్కరోజు యూరియా సమస్య రాలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు మోహన్‌రెడ్డి, నారాయణపురం వెంకటేశులు, సీనియర్ నాయకులు తిరుమల వెంకటేశులు, గోపారం శ్రీనివాస్ శెట్టి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా డాన్స్ స్పోర్ట్స్ కాంపిటేషన్‌లో బచ్చన్ విద్యార్థులు ప్రథమ స్థానం

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: నగరంలోని బచ్చన్ ప్లే పాఠశాల విద్యార్థులు జిల్లా డాన్స్ స్పోర్ట్స్ కాంపిటేషన్ లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. సాంస్కృతిక నృత్యం, దాండియా వేషధారణలో నాట్య ప్రదర్శనలు ఇచ్చారు. ఈ డాన్స్ పోటీలకు ముఖ్యఅతిథిగా శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు హాజరై మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సృజనాత్మకంగా తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించడం హర్షనీయమని కొనియాడారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలియజేసి మెడల్స్, బహుమతులు, సర్టిఫికెట్ అందజేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసిన డాన్స్ మాస్టర్ రవిని ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

ప్రభుత్వ భూమి కబ్జాదారులపై చర్య తీసుకోండి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : మండలంలోని హరే సముద్రం గ్రామంలో తాగునీటి ట్యాంకు చుట్టుపక్కల ఉన్న పోరంపోగు భూమిని ఆక్రమించుకొన్నారని గతంలో తహసిల్దార్‌కు గ్రామ ప్రజలు వినతిపత్రం అందజేశారు. 271- నెంబరు గల భూమి పోరంబోగు భూమి అని దాన్ని ఎవరు సాగు చేయకూడదని ప్రభుత్వం హెచ్చరిక బోర్డు వేసింది. ఆ భూమిలో బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన తిమ్మప్ప జొన్న పంట సాగు చేశారని మంగళవారం బొమ్మనహాళ్ తాసిల్దార్ మునివేలుకు గ్రామ ప్రజలు వినతిపత్రం అందజేశారు. తెల్లవారుజామున ట్రాక్టర్‌తో తీసుకొని దౌర్జన్యంగా జొన్న విత్తనాలు వేసి సాగు చేశారని వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకొని తాగునీటి ట్యాంకు వద్ద గల భూమిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిప్పేస్వామి, మాజీ సర్పంచ్ పల్లె తిప్పేస్వామి, దివాకర్, వన్నూరు స్వామి, లక్ష్మీనారాయణ, జీవనమూర్తి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉరవకొండ మీదుగా తుంకూరుకు రైలు మార్గానికి ముఖ్యమంత్రి కృషి చేయాలి



విశాలాంధ్ర-ఉరవకొండ : ఆంధ్ర కర్ణాటక సరిహద్దులో గల వెనుకబడిన ప్రాంతమైన, గుంతకల్ నుండి వయా ఉరవకొండ మీదుగా తుంకూరు రైలు మార్గం ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరియు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక కృషి చేయాలని గిరిజన ఐక్య సాధన సమితి అధ్యక్షులు మూడ్ కేశవ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర కర్ణాటక సరిహద్దులో గల వెనుకబడిన ప్రాంతమైన గుంతకల్లు వయా ఉరవకొండ మీదుగా తుంకూర్ రైలు మార్గాన్ని నిర్మిస్తే కర్ణాటక రాష్ట్రంలోని తుంకూర్ ను కలుపుతూ ఉరవకొండ, కళ్యాణ్ దుర్గం, మడకశిర, కర్ణాటక రాష్ట్రంలోని మధుగిరి,పావుగడ ప్రాంతాల మీదుగా బ్రాడ్ గేజ్ రైలు మార్గం నిర్మించాలని 1933వ సంవత్సరంలో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదన సర్వే ఇప్పటివరకు అమలు కు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా రెండు రాష్ట్రాల్లోనే కొన్ని వందల గ్రామాలు లబ్ది పొందే ఈ ప్రాజెక్టును చేపట్టవలసిందిగా పేర్కొన్నారు. బుధవారం అనంతపురం కి వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి వినతిపత్రాన్ని అందివ్వనున్నట్లు ఆయన తెలిపారు.

సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ విజయవంతం చేద్దాం

మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాబు

విశాలాంధ్ర-ధర్మవరం/తాడిమర్రి: సెప్టెంబర్ 10న అనంతపురంలో నిర్వహించనున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ విజయవంతం చేయడానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ధర్మవరం నియోజక వర్గంలో ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ధర్మవరం నియోజకవర్గంలోని తాడి మర్రి, ముదిగుబ్బ, బత్తలపల్లి, ధర్మవరం రూరల్ మండలాల్లోని బీజేపీ పార్టీ కార్యాలయాల్లో ప్రత్యేక సన్నాహక సమావేశాలు నిర్వహించబడ్డాయి. సమావేశాలకు ఆయా మండలాల బీజేపీ అధ్యక్షులు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు హాజరయ్యారు. సభ విజయవంతం కోసం జన సమీకరణ, కార్యకర్తల సమీకరణ, భద్రతా ఏర్పాట్లు, వాహన సదుపాయాలు, స్థానిక నాయకత్వం తో సమన్వయం వంటి అంశాలపై విశదీకరణగా చర్చించారు. సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక మైలురాయి కానుంది అని తెలిపారు. ఈ సభ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో ఆంధ్రప్రదేశ్‌లో అమలు అవుతున్న సూపర్ సిక్స్ పథకాల ప్రాముఖ్యతను ప్రజలకు విపులంగా తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. వివక్షలేని సంక్షేమం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాలు రాష్ట్రవ్యాప్తంగా విజయవం తంగా అమలు అవుతున్నాయని అన్నారు. ప్రతి కార్యకర్త సభ ప్రారంభానికి ముందుగానే నిర్ణయించిన సమయానికి గ్యాలరీ వద్ద హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశాల్లో కార్యదర్శులు, మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, తాడిమర్రి మండల ఉపాధ్యక్షుడు అనుగుత్తి రమణ, కురవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

ఎరువుల కొరత నివారించి రైతులను ఆదుకోవాలి

- సోలార్ నుండి వచ్చే నిధులను మండల అభివృద్ధికే కేటాయించాలి.
- వలసల నివారణకు ఉపాధి హామీ పని దినాలు 200కు పెంచాలి..
- హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి ఆయకట్టుకు నీటినందించాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య

విశాలాంధ్ర-నంబులపూలకుంట: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతు పక్షపాతిగా వ్యవహరించి రైతులను ఆదుకోవాలని సిపిఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీనియర్ నాయకులు,జిల్లా రైతు సంఘం నాయకులు సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన సిపిఐ మండల సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు ఏజెంట్లుగా వ్యవహరిస్తూ.. ఒక వైపు అన్నదాతా సుఖీభవా అంటూనే ఆ రైతులకు ఎరువులను అందించడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. పంటలు సాగు చేస్తున్న రైతులకు సమయానికి ఎరువులు అందించలేని స్థితిలో ఈ ప్రభుత్వాలు ఉన్నాయని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతు సాయంగా రూ20 వేలు వెంటనే విడుదల చేయాలన్నారు. హంద్రీనీవా కాలువ పనులను వెంటనే పూర్తి చేసి జిల్లాలోని 2 లక్షల 60 వేల ఎకరాలకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఇక్కడి నుండి ఎక్కడో ఉన్న కుప్పానికి నీరు తరలిస్తున్నారని, ఇక్కడి భూములు మాత్రం సాగు నీరు అందక బీడు భూములుగానే ఉన్నాయన్నారు. రైతు రుణ విమోచన చట్టం తీసుకువచ్చి రైతులపై ఉన్న అన్ని రుణాలను ఒకేసారి మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పాడి రైతులకు మద్దతు ధర కల్పన, కౌలు రైతుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం, 2013 భూ సేకరణ చట్టంలోని రైతు వ్యతిరేక అంశాల రద్దు వంటి అంశాలను స్పష్టం చేశారు. ఎన్‌పి కుంట మండలంలో అభివృద్ధి అందని ద్రాక్షలా మారిందని,ఏటా సోలార్ కంపెనీల ద్వారా వచ్చే కోట్లాది రూపాయలు ఎక్కడికి పోతున్నాయని ప్రశ్నించారు. మండలంలో ఇప్పటికి త్రాగునీరు,వీధి దీపాలు, మరుగుదొడ్లు,మండల కేంద్రంలో డ్రైనేజి వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని.. సోలార్ నుండి వచ్చే సి ఎస్ ఆర్ నిధులు మండల అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కరువు ప్రాంతమైన సత్యసాయి జిల్లాలో పనులు లేక వేలాది మంది వలస పోతున్నారని,ఉపాధిహామీ పథకం ప్రతి పేదవారికి వర్తింపజేసి పనిదినాలు 200గా చేయాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను రద్దు చేయాలన్నారు. పోలవరంతో పాటు రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం తక్షణమే అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు.రైతుల కోసం బీమా రుసుము ప్రభుత్వమే భరించాలని, 50 ఏళ్లు నిండిన రైతులకు నెలకు రూ.10 వేల పెన్షన్ మంజూరు చేయాలని, విత్తనాలు, ఎరువులు సకాలంలో అందివ్వకుంటే ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి నళ్ళజోడు పవన్, సహాయ కార్యదర్శి హసన్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి మధు నాయక్,జిల్లా మహిళా నాయకురాలు ఆదిలక్ష్మమ్మ, నాయకులు రమణ, శ్రీరాములు నాయుడు, గంగులప్ప, రాజారెడ్డి,లాలూ సాబ్, మనోహర్, శంకరప్ప,బిబి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో ఉన్న ఏపీకి చంద్రబాబు ఆక్సిజన్ ఇస్తున్నారు..

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

విశాలాంధ్ర-కొత్తచెరువు: ఐదేళ్ల వైసిపి పాలనలో అప్పుల్లో కూరుకుపోయి ఊపిరి అందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆక్సిజన్ అందిస్తున్నారని. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పేర్కొన్నారు. కొత్త చెరువు మార్కెట్ యార్డ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కొత్త చెరువు ప్రాథమిక సహకార సొసైటీ అధ్యక్షులు అప్ప కొండప్ప గారి హరిప్రసాద్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ. గత వైసిపి పాలనలో జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టారని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడాది పాలనలో రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి కొనసాగుతోందని తెలిపారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను 90 శాతం అమలు చేశామని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిన కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలపడానికి అనంతపురం లో బుధవారం నిర్వహించనున్న విజయోత్సవ సభకు నియోజకవర్గం నుంచి 50 వాహనాలకు పైగా ఏర్పాటు చేశామని ఈ సభకు హాజరై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ,బీజేపీ అధ్యక్షులు మాధవ్‌తో పాటు కూటమి ప్రభుత్వానికి పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలకు పెద్ద ఎత్తున తరలివచ్చి కృతజ్ఞతలు తెలపాలని కోరారు.పార్టీకి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే ప్రభుత్వంలో తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పడానికి ఈరోజు ప్రమాణ స్వీకారం చేస్తున్న సొసైటీ అధ్యక్షులు హరిప్రసాద్ , డైరెక్టర్లు లక్ష్మీదేవి, ముసలత్ అహమ్మద్ నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శివప్రసాద్, మండల టిడిపి కన్వీనర్లు రామకృష్ణ వలిపి శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ వాణి శ్రీనివాస్, రాష్ట్ర డైరెక్టర్లు కురువ శ్రీనివాసులు ,మాజీ సర్పంచులు హరినాథ్ చౌదరి, మాణిక్యం బాబా, బైరాపురం సర్పంచ్ రవి, మాజీ జడ్పిటిసిలు లక్ష్మీనారాయణ, గఫార్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించంత వరకు పోరాటలు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని ఏఐటియుసి ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రోజువారి కార్మికులకు, ఆప్కాస్ కార్మికులకు 2 నెలల నుంచి క్లాప్ కార్మికులకు3 నెలలు జీతాలు నూతనంగా విధులకు చేరిన కార్మికులకు7నెలలు పెండింగ్ ఉన్నాయని వీరందరికీ ప్రతినెలా జీతాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. చాలీచాలని జీతాలతో ప్రతినెల జీతం వస్తేనే కుటుంబాలు గడుస్తాయని లాంటిది నెలలు నెలలు పెండింగ్ ఉంటే ఏ విధంగా వారు కుటుంబాలు గడుస్తాయని ప్రశ్నించారు. పారిశుద్ధ్య కార్మికులకు గ్లౌజులు, కొబ్బరి నూనె, సబ్బులు కనీస సౌకర్యాలు లేకుంటేవాళ్ళు అనారోగ్యం పాలు కాకుండాచూడాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల నాయకులు మల్లికార్జున, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు కరణ్, మహేష్, బావక్క తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కలలపై చంద్రబాబు కత్తి

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మంగళవారం ధర్మవరం బహుజన్ సమాజ్ పార్టీ ఇంచార్జి సాకే వినయ్ కుమార్ విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. వైద్యవిద్యను ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులకు దూరం చేయాలనే చంద్రబాబు కుట్ర పన్నడం పేద విద్యార్థుల డాక్టర్ కావాలన్న కల కలగానే మిగిలిపోతుం దని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లు కోల్పోతున్న ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులు. మెడికల్ సీట్లు కోట్ల రూపాయలకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడడం దౌర్భాగ్యం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వైద్య విద్యను ప్రైవేటు చేతుల్లోకి వదిలివేయడం వల్ల పేద విద్యార్థుల కలలు చెదిరిపోతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులను 63 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వడం లంచాల పాలిటే తప్ప ప్రజల ప్రయోజనానికి కాదన్నారు. తాజాగా 10 మెడికల్ కళాశాల లను ప్రైవేటీకరించడానికి కేబినెట్ ఆమోదం తెలపడం దారుణమని మండిపడ్డారు. మంత్రి నారాయణ నడుపుతున్న విద్యాసంస్థలకు కళాశాలలను ధారాదత్తం చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ జిల్లాకు ఎటువంటి ప్రయోజనం చేకూర్చలేక పోయారని, ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ల కొరత, సిబ్బంది లేమి ఉందని వెంటనే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ బియస్పాపి బత్తలపల్లి ఇంచార్జి అమర్నాథ్ , ధర్మవరం రూరల్ అధ్యక్షులు మల్లెపోగుల మళ్ళి కార్జున, బియస్పాపి నాయకులు సిసింద్రీ, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర-పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం రైతాంగాన్ని నిర్వీర్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రైతు పోరు బాట కార్యక్రమంలో భాగంగా గణేష్ కూడలిలోని వైసీపీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు ఎరువులు అందకుండా చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని మండిపడ్డారు. ఎరువులు, యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న రైతాంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. బ్రహ్మాండంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పి కోత విధిస్తున్నారని మండిపడ్డారు. అన్నదాత సుఖీభవ డబ్బులు కూడా ఒక ఏడాది రైతులకు అందకుండా ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అనర్హులు ఉన్నారని సాకు చూపుతూ ఇష్టం వచ్చినట్లు పింఛన్లు తొలగించారని, శ్రీనిధి రుణాలు ఇతర సంక్షేమ పథకాలు అన్నింటిని ప్రభుత్వం కోత విధిస్తోందన్నారు. ఈ ప్రభుత్వానికి అమరావతి మీద ప్రేమ తప్ప మిగతా ఏ జిల్లా అభివృద్ధి చెందాలని కోరుకోవడం లేదన్నారు.మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మండల కన్వీనర్లు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాత బాధ పట్టదా..

మాజీ మంత్రి ఉషశ్రీ

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండలో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ నాయకులు అన్నదాత పోరు ఆందోళన చేపట్టారు. స్థానిక వైసీపీ కార్యాలయం నుండి ఆర్డీవో ఆఫీస్ వరకు రైతన్నలతో కలిసి భారీ ర్యాలీ చేశారు. యూరియా, ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆనంద రావుకు వినతిపత్రం అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు, ఉషశ్రీ చరణ్ హిందూపురం సమన్వయకర్త కురుబ దీపిక, మడకశిర సమన్వయకర్త ఈరలకప్ప, ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కోసం, ఎరువుల కోసం రైతులు కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు ప్రభుత్వం మొద్దునిద్రపోతోం దని ధ్వజమెత్తారు. అచ్చెన్నా యుడుకు గానీ ఏ మాత్రం చీమకుట్టినట్టయినా లేదన్నారు. రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను 50 శాతం ప్రభుత్వం ఆధీనంలోని మార్క్‌ఫెడ్‌కు 50 శాతం ప్రైవేటుకు కేటాయిస్తారు... ఈ ఎరువులను మార్కెట్ యార్డుల ద్వారా, పీఏసీఎస్‌లు, ఎఫ్పీఓల ద్వారా పంపిణీ చేస్తారు.. ప్రైవేటుకు కేటాయించన ఎరువులను ప్రైవేటు దుకాణాల ద్వారా రైతులకు పంపిణీచేస్తారని అన్నారు. అలాకాకుండా, మార్క్ ఫెడ్ కు ఇవ్వాల్సిన 50 శాతం ఎరువులను తగ్గించి, ప్రైవేటుకు కేటాయిం చడం అత్యంత దుర్మార్గం అన్నారు. ఏటా 6-7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వినియోగం ఉంటుందని.. ప్రైవేటుకు ఇచ్చిన యూరియాను బ్లాక్ చేసి, బస్తా రూ.270 ఉంటే, దాన్ని రూ.450-600కు అమ్ము తున్నారు. అంటే ఒక్కో బస్తామీద రూ.200 నుంచి రూ.300 వరకూ అధికంగా రైతుల్ని పీల్చి పిప్పి చేస్తున్నారన్నారు. వసూలుచేసిన ఆ సొమ్ము ఎవరి జేబులోకి చేరిందని ప్రశ్నించారు. దాదాపు రూ.250 నుంచి రూ.300 కోట్ల వరకూ స్కాం చేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్‌బీకే సిబ్బంది ప్రతి గ్రామంలోనూ ఉన్నారు.. వారి సేవలను ఎందుకు వాడుకోలేదని ప్రశ్నించారు. అక్రమ నిల్వలపై ఎందుకు తనిఖీ చేయడం లేదన్నారు. ఈ రెండేళ్లలో వరి, మిరప, పత్తి, జొన్న, కందులు, మినుములు, పెసలు, మొక్క జొన్న, సజ్జ, రాగులు, అరటి, చీనీ, కోకో, పొగాకు, ఉల్లి ధరలు పడిపోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడు తున్నా, చిత్తశుద్ధితో ఏరోజూ రైతును మీ ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. .మా ఐదేళ్ల కాలంలో, రైతులకు ఇలాంటి కష్టకాలం వచ్చినప్పుడు 9,025 టన్నుల ఉల్లిని ప్రభుత్వమే కొనుగోలు చేయడం ద్వారా రైతులకు తోడుగా నిలబడ్డామని గుర్తు చేశారు. చీనీ ధర కూడా ఇప్పుడు మీ హయాంలో పడిపోయి టన్ను రూ.6 వేల నుంచి రూ.12 వేలు మాత్రమే పలుకుతోంది. మా హయాంలో టన్నుకు కనిష్టంగా రూ.30 వేలు, గరిష్టంగా రూ.లక్ష ధర రైతులకు లభించిందని పేర్కొన్నారు. మేం ఏర్పాటు చేసిన ధరల స్థిరీకరణ నిధి కింద రూ.7,802 కోట్లు ఖర్చు చేసి మేం రైతులకు తోడుగా నిలబడితే మీరు ఆ విధానానికి మంగళం పాడారన్నారు. రైతు భరోసాను మొదటి ఏడాది ఎగ్గొట్టారు. రెండేళ్లకు కలిపి రూ.40 వేలు ఇవ్వాల్సి ఉంటే ఇచ్చింది రూ.5 వేలు మాత్రమే.... అదీ 7 లక్షల మంది రైతు కుటుంబాలకు ఎగ్గొట్టారని మండిపడ్డారు. కార్యక్రమంలో పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల రైతులు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా సకాలంలో పంపిణీ చేయండి

విశాలాంధ్ర-నల్లమాడ: మండలంలో వ్యవసాయబోరు బావుల్లో సాగుచేస్తున్న వరి,మొక్కజొన్న తదితర సాగు చేసిన రైతులకు ప్రభుత్వం యూరియా,డిఏపి వెంటనే రైతులకు పంపిణీ చేయాలని మంగళవారం సీపీఐ మండల కార్యదర్శి వలిపి వెంకటరమణ నాయకులతో వ్యవసాయాధికారి అబ్దుల్ హక్‌కు వినతి పత్రం అందజేశారు. దళారుల ప్రమేయం లేకుండా యూరియా పంపిణీ చేయాలని, రైతులను ఇబ్బంది పెడితే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల ఉప కార్యదర్శులు నాగేంద్ర, గంగాధర్, నంజప్ప పాల్గొన్నారు.

నేడు సత్యసాయి ఎయిర్ పోర్టుకు ఉపముఖ్యమంత్రి పవన్ రాక

విశాలాంధ్ర-పుట్టపర్తి : జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బుధవారం సత్యసాయి విమానాశ్రయానికి రానున్నారు. అనంతపురంలో జరిగే సూపర్ హిట్ కార్యక్రమంలో పాల్గొనడానికి శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఉదయం 11:30 గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి 12:30 గంటలకు సత్యసాయి విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడి నుంచి 1:00 గంటకు ప్రత్యేక హెలికాప్టర్ బయలుదేరి అనంతపురంకు చేరుకుంటారు. అక్కడ కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం తిరిగి హెలికాప్టర్‌లో 5:10 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడ నుంచి 5:15కు ప్రత్యేక విమానంలో గన్నవరానికి బయలుదేరి వెళ్లనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

సీపీఐ మండల కార్యదర్శిగా రాజారెడ్డి

విశాలాంధ్ర-నంబులపూలకుంట: సిపిఐ పార్టీ స్థానిక సీనియర్ నాయకులు, జిల్లా రైతు సంఘం నాయకులు సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సమితి సమావేశానికి జిల్లా కార్యదర్శి ఎం వేమయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రాజారెడ్డి,సహాయ కార్యదర్శిగా గంగులప్ప, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శిగా జివి రమణ, కౌన్సిల్ సభ్యులుగా 11 మందిని ఎన్ను కున్నారు. ఎన్నికైన వారిని జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అభినందిస్తూ పలు సూచనలు చేశారు. పేద, కర్షక,కార్మిక సమస్యలు పరిష్కరించే విధంగా వారికి అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సిపిఐ డివిజన్ కార్యదర్శి నళ్ళజోడు పవన్, సహాయ కార్యదర్శి హసన్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి మధు నాయక్,జిల్లా మహిళా నాయకురాలు ఆదిలక్ష్మమ్మ, నాయకులు రమణ, శ్రీరాములు నాయుడు, లాలూ సాబ్, మనోహర్, శంకరప్ప, బిబి తదితరులు పాల్గొన్నారు.

అప్పు చేసి కొందామన్నా యూరియా దొరికే పరిస్థితి లేదు

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: నేడు చంద్రబాబు పాలనలో వ్యవసాయం సంక్షోభంలో ఇరుకుందని, పంట నష్టపోతే రైతులకు పరిహారం ఊసే లేదు.. సంక్షేమం కూడా అందించే పరిస్థితిలో లేరని, కనీసం రైతులు అప్పుచేసి ఎరువులు యూరియా కొందామంటే దొరికే పరిస్థితి లేదని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం వైసీపీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు అన్నదాత పోరు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కార్యాలయం నుండి ఆర్డిఓ కార్యాలయం వరకు కొనసాగింది. మధ్యలోనే పోలీసుల అడ్డుకోవడంతో, రోడ్డునే ఆయన బైఠాయించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, తమదైన శైలిలో నిరసన తెలిపారు. అనంతరం కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ చూడని సంక్షోభాన్ని రైతన్నలు చవిచూస్తున్నారని, రాష్ట్రంలో రైతన్నలు అప్పుల బాధలు ఆత్మహత్యలు, నిత్యకృత్యమవుతున్నాయని, ఆదుకునే వాడు లేక రైతు బిచ్చగాడిలాగా మారుతున్నాడని ఎద్దేవా చేశారు. రైతాంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వైసీపీ శ్రేణులు రైతులు అన్నదాతలు పోరు నిరసన ర్యాలీ చేపట్టి నినాదాలను హోరెత్తించారు. ఈ క్రమంలో కాస్త ఉద్రిక్తత వాతావరణం నెలకొంది దీంతో ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించక తప్పలేదు. రాష్ట్రంలో యూరియా కోసం రైతులు బారులు తీరి వందలాది మంది రోజులు తరబడి వేచి చూస్తున్నా దుర్భర పరిస్థితులు దాపరించడం సిగ్గుచేటు అన్నారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వములో ఆర్బీకేల ద్వారా ఎప్పటికప్పుడు యూరియా ఎరువులు విత్తనాలను అందుబాటులో ఉంచి జగనన్న రైతన్నకు దన్నుగా నిలిచా రన్నారు. పెద్దఎత్తున వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్డీటీ సంస్థ సేవలు పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-అగళి : ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిరుపేదలకు సేవలు అందిస్తున్న ఆర్‌డిటి సేవలకు అంటకం కలగకుండా కేంద్రప్రభుత్వం ఎఫ్‌సిఆర్‌ఎ నిధులు కొనసాగించాలని అగళిలో మంగళవారం జడ్పీటీసీ ఉమేష్ సింగల్ విండో అధ్యక్షులు కుమార్ స్వామితో పాటు అగళి సర్పంచ్ లక్ష్మమ్మ, హళ్లికేరా పంచాయతీ సర్పంచ్ ముద్దరాజులకు మహిళలు వినతిపత్రం అందించారు.మండల పరిధిలోని హళ్లికేరా అగళి గ్రామాల్లో మంగళవారం ఆర్డిటి సంస్థ అభిమానులు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు, ర్యాలీగా సచివాలయాలకు వెళ్లి గ్రామ సర్పంచర్లకు వినతిపత్రం సమర్పించారు కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ తిప్పేస్వామి, నాయకులు షౌకత్ ఆలీ ఎస్‌సి సెల్ అధ్యక్షులు భూతరాజు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

విశాలాంధ్ర-అమరాపురం : మండల పరిధిలోని కేశివరం గ్రామ పంచాయతీ రైతు సేవ కేంద్రంలో మంగళవారం రైతులకు 280 బ్యాగుల యూరియా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మంజునాథ్ తెలిపారు. శివరం రైతు సేవా కేంద్రానికి మంగళవారం 12.6 మెట్రిక్ టన్నుల యూరియా రాగా రైతులకు సజావుగా పంపిణీ చేశామని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. అవసరమైన రైతులు మాత్రమే యూరియా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు మోహన్, ఏఎస్ఐ రామాంజనేయులు, శివ జ్యోతి గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

విశాలాంధ్ర -ఓడిసి రూరల్: అచ్చామియా పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కట్టుబడి గౌస్ లాజంకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు రావడంపై మంగళవారం గ్రామస్థులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామములోని తమ పిల్లలకు మంచి క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పుతున్నారన్నారు, అలాగే గ్రామస్తులతో మంచి స్నేహ సంబంధాలు కలిగి ఉన్నాడని కూడా అన్నారు, విద్య, సామాజిక రంగాలలో ఆయన చేస్తున్న కృషికి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు రావడం మా గ్రామానికి ఎంతో గర్వకారణంగా ఉందన్నారు, కార్యక్రమంలో గ్రామపెద్దలు అచ్చామియాసాహెబ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ యుహనీస్ బీ, శర్మాద్, వెంకటేష్, జబ్బార్, నౌషాద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

విశాలాంధ్ర-ధర్మవరం: స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ యూనిట్ విభాగంలో ప్రోగ్రామ్ ఆఫీసర్, డాక్టర్ బి. గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో "నషా ముక్త్ భారత్ అభియాన్"లో భాగంగా డ్రగ్స్ వాడకం నివారణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.ప్రభాకర్ రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమామికి ముఖ్య అతిథి పాలిటెక్నిక్ కళాశాల, ప్రిన్సిపాల్ శ్రీ. జె.వి.సురేష్ బాబు మాట్లాడుతు.. ఆకర్షణ, స్నేహితుల ఒత్తిడి, కొత్త అనుభవం తెలుసుకోవాలనే ఆసక్తి వంటి కారణాలతో చాలామంది విద్యార్థులు డ్రగ్స్ బారిన పడుతున్నారని .. డ్రగ్స్ వాడకం వల్ల శారీరక ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడి, చదువులో వెనుకబడటం, కుటుంబానికి ఇబ్బందులు, చివరికి జీవితాన్ని నాశనం చేసుకునే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ డా.కె.ప్రభాకర్ రెడ్డి మట్లాడుతూ మన కుటుంబం, సమాజం దేశం మనపై ఆశలు పెట్టుకున్నాయి. డ్రగ్స్ అనే మాయవలయంలో పడకుండా, ఆరోగ్యకరమైన జీవనాన్ని ఎంచుకొని మీ లక్ష్యం సాధించుకోవాలని తెలియచేసారు. కార్యక్రమంలో డా.ఎస్.చిట్టెమ్మ, డా.బి. త్రివేణి, డా.ఎస్ షమీవుల్లా, ఎన్.సి.సి. అధికారి ఎన్.పావని, ఎ.కిరణ్ కుమార్, యం. పుష్పావతి బి.ఆనంద్, సరస్వతి, జి.మీనా, జి.ధనుంజయ పాల్గొన్నారు.

యూరియా పంపిణీ ప్రక్రియ తనిఖీ

విశాలాంధ్ర-బుక్కపట్నం: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ యూరియా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆర్డీవో సువర్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ యూరియా పై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. పంట సాగు చేసే ప్రతి రైతుకు యూరియా అందిస్తామన్నారు. ఇప్పటిదాకా మండల వ్యాప్తంగా 80 టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఏడీఏ సనావుల్లా మాట్లాడుతూ రైతులందరూ వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల ప్రకారం నానో యూరియాపై అవగాహన పెంచుకొని పంట దిగుబడులు పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బుక్కపట్నం ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షుడు చెన్నకృష్ణ, కురవ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఇంచార్జ్ తహసీల్దార్ నరసింహులు, వ్యవసాయ అధికారి నటరాజ్, సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు సంజీవ రాయుడు, రైతు సేవా, సహకార సంఘ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నానో యూరియాతో పంటలకు మేలు

విశాలాంధ్ర-కదిరి: నానో యూరియా వాడకం ద్వారా పంటలను కాపాడుకోవచ్చునని ఏడిఏ సనావుల్లా తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 10 మండలాలలో 256 మెట్రిక్ టన్నుల యూరియా ప్రైవేట్ రైతు సేవ కేంద్రాలలో సిద్ధంగా ఉందని తెలిపారు. సాగుచేసిన పంటల ద్వారా అధిక దిగుబడి సాధించడానికి యూరియా 45కేజీల బస్తా బదులు నానో యూరియా 1/2 ద్రావణంలో 120 లీటర్ల నీటిని కలిపి అన్ని పంటలకు పిచికారి చేయడం ద్వారా 45 రోజుల నుండి 45 రోజుల వరకు యూరియా కొరతను అధికమించవచ్చని ఆయన తెలిపారు. వ్యవసాయ అధికారి శ్రీహరినాయక్ పాల్గొన్నారు.

40 వేల మందికి భోజనాలు ఏర్పాట్లు

విశాలాంధ్ర-పెనుకొండ: ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమంలో భాగంగా పెనుకొండ నియోజకవర్గం హిందూపురం నియోజకవర్గం మడకశిర నియోజకవర్గాల నుండి అనంతపురంకు వెళ్తున్న నాయకులకు కార్యకర్తలకు రాష్ట్ర మంత్రి సవితమ్మ పెనుకొండ కియా పరిశ్రమకు ఎదురుగా ఉన్న హెచ్‌పి పెట్రోల్ బంకు పక్కన 40, వేల మందికి భోజనం ఏర్పాటు చేశారు. నాయకులు కార్యకర్తలు భోజనం చేసుకొని సూపర్ హిట్ సూపర్ సిక్స్ కార్యక్రమానికి అనంతపురానికి బయలుదేరాలని తెలియజేశారు. నాయకులు అధికారులతో కలిసి మంత్రి భోజనం ఏర్పాట్లను పరిశీలించారు.

దివ్యాంగ ప్రతిభ విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర -హిందూపురం : పట్టణంలో ఉన్న భవిత కేంద్రంలో సయ్యద్, నాగశ్రీ ఇద్దరు విద్యార్థులు ఐటిఐ మొదటి సంవత్సరం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా వారి ప్రతిభను గుర్తించి మంగళవారం ఎంఈఓ గంగప్ప ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ డి.ఈ.రమేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మెమొంటోలతో సన్మానించారు. మునిసిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ఎంతోమంది వైకల్యం ఉన్నవాళ్లు అత్యుత్తమ స్థానానికి ఎదిగారని వాళ్లను ఆదర్శంగా తీసుకొని వికలాం గులు ఎదగాలని కోరారు. ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతిభావంతులైనా నిక్కీ ఉజశిక్ డాక్టర్ సంజీవరాయ శర్మలను ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఆనందబాబు, ఎంఈఓ-2 ప్రసన్నలక్ష్మి, ఫిజియోథెరపిస్ట్ రూపేష్ నాయక్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, బుధవారం 10, సెప్టెంబరు 2025

పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర-తలుపుల: స్థానిక ప్రాథమిక ప్రభుత్వ వైద్యశాలలో రూరల్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భవతులకు పౌష్టికాహారం అందించడం జరిగింది. ట్రస్టు సభ్యులు మన్సూర్ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తలుపుల మండలం పెద్దది అని సుమారుగా 15 నుండి 20 కిలోమీటర్ల దూరం నుండి గర్భవతులు ప్రతి ఒక్క నెల వైద్య నిమిత్తం కోసం ప్రాథమిక వైద్యశాలకు వస్తున్నారని అలాగే చెకప్ లు తరువాత మధ్యాహ్న భోజనానికి చాలా ఇబ్బంది పడుతున్నారని గ్రహించి రూరల్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో గర్భవతులకు పౌష్టికాహారం అందిస్తున్నామని అలాగే తల్లి బిడ్డ ఆరోగ్యమే ముఖ్యం అని తెలియజేశారు. ఈరోజు గర్భవతులకు, ఆశా కార్యకర్తలకు మరియు వైద్య సిబ్బందికి సుమారుగా 170 మందికి భోజనాలు సదుపాయం కల్పించడం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వెలుగు ఏపీఎం రమణమ్మ, డాక్టర్ ఆశ్రిత, ఎద్దుల రాముడు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో మంచి దిగుబడి

విశాలాంధ్ర-అగళి : రసాయనిక ఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రియా ఎరువులు వాడకంతోనే పంటలు ఆశాజనీకంగా దిగుబడి సాధించవచ్చని ఉద్యాన శాఖధికారి చంద్రశేఖర్ వ్యవసాయాధికారి నాగరాజు తెలిపారు.మండల పరిధిలోని ఆలుడి, కొమరేపల్లి గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానంగ రైతులకు సేంద్రియ ఎరువుల వాడకం నానో యూరియా వాడకం నానో డీఏపీ ఎరువుల వాడకం పై అవగాహన కల్పించారు, ప్రతి రైతు సేవ కేంద్రంలో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు, ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్ రైతులకు పండ్ల తోటల పెంపకంపై కూడా అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమానికి తహసీల్దార్ సుబ్బారావు, వ్యవసాయ అధికారి నాగరాజు వీఆర్వో నరసింహామూర్తి రైతులు పాల్గొన్నారు,

నానో యూరియాను వాడండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: బోరు బావుల కింద పంటలు సాగు చేసిన రైతులు యూరియా కి బదులు లిక్విడ్ అయిన నానో యూరియా వాడకాన్ని రైతులు అలవాటు చేసుకోవాలని. జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రెడ్డి బాలాజీ, పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ, ఏడిఏ కృష్ణ మీనన్, తెలిపారు కొత్త చెరువులోనే మన గ్రోమోర్ సెంటర్కు 280 బస్తాల యూరియా మంగళవారం రావడంతో వాటిని రైతులకు అందజేశారు ఈ పంపిణీ కార్యక్రమాన్ని వారు పరిశీలించి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రతిరోజు రైతు సేవా కేంద్రం ద్వారా కానీ సహార సంఘాల ద్వారా గాని సరఫరా చేయడం జరుగుతుందన్నారు కావున రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సతీష్ బాబు, ఇంచార్జ్ తాసిల్దార్ బాలాంజనేయులు, ఏఈఓ సునీత, సిబ్బంది భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుకు సన్మానం

విశాలాంధ్ర-అగళి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అగళి లో విధులు నిర్వహించి ఇతర ప్రాంతాలకు బదిలీ పై వెళ్లిన ఉపాధ్యాయులు మంగళవారం ఉపాధ్యాయులు వారిని ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లిన ప్రధానోపాధ్యాయులు వరదరాజులు, సైన్స్ ఉపాధ్యాయులు బి.నాగేంద్రబాబు, గణిత ఉపాధ్యాయురాలు జే.సుహాసిని, ఆర్ట్ ఉపాధ్యాయుడు బి.ఓబులేసు లను ఘనంగా సన్మానించారు. వారి సేవలను విద్యార్థులు గ్రామ పెద్దలు కొనియాడారు. అదేవిధంగా ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

ఆలయ చైర్మెన్ డైరెక్టర్‌కు సన్మానం

విశాలాంధ్ర-హిందూపురం : పట్టణంలోని పేట వెంకటేశ్వర స్వామి టెంపుల్ చైర్మెన్‌గా ఎన్నికైన భగీరథి నవీన్‌ను, డైరెక్టర్‌గా ఎన్నికైన వెంకట చలపతిని సోమవారం ఇంటికి ఆహ్వానించి, మర్యాదపూర్వకంగా జనసేన పార్టీ హిందూపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఆకుల ఉమేష్ మర్యాద పూర్వకంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఐ డొనేషన్ కరపత్రాల విడుదల

విశాలాంధ్ర-ధర్మవరం: యువర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐ డొనేషన్ కరపత్రాలను విడుదల చేశారు. కళాశాలలో ఐ డొనేషన్ మీద వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను, ప్రదానం చేశారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రాలతో పాటు షీల్డ్ లను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ డిపిఎం డాక్టర్. అనురాధ, యువసే ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరామ్, కోశాధికారి మోహన్, గొర్రె రమేష్ బాబు పాల్గొన్నారు.

రక్త దానం చేయండి ప్రాణ దాతలుగా నిలవండి

– ధర్మవరం వన్ టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్

విశాలాంధ్ర-ధర్మవరం: రక్తదానం చేసి, ప్రాణదాతలుగా నిలవాలని వన్టౌన్ సిఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణం లోని స్థానిక ఎల్ పి సర్కిల్ లోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో ఏపీ ఎస్ ఎఫ్ వారి ఆధ్వర్యంలో రజని హెల్పింగ్ హాండ్స్, రక్తబంధం వారి సౌజన్యంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ధర్మవరం వన్ టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించగా, ఏపీ ఎస్ ఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ ఆకుల రాఘవేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, అడ్వకేట్ సుమలత, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైట్ ప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం సీఐ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రక్త దాన ఆవశ్యకతను విద్యార్థినులు, యువత తెలుసుకోవాలని, ఒకరు రక్తదానం చేస్తే ముగ్గురి ప్రాణాలను కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ మీ బ్లడ్ గ్రూపును తెలుసుకోవాలన్నారు. ఏపీఎస్ఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ ఆకుల రాఘవేంద్ర మాట్లాడుతూ మనిషి ప్రాణాన్ని కాపాడగల శక్తి డాక్టర్ దగ్గర ఉన్న మందుల్లో కాదు, మన దగ్గర ఉన్న రక్తంలో ఉంది.అందుకే రక్త దాత ప్రాణదాత తో సమానమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున మాట్లాడుతూ 12.5 శాతము హిమోగ్లోబిన్ కలిగి ఉన్న ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి రక్త దానం చేయొచ్చని,250- 300 ఎం.ఎల్ రక్తాన్ని ఒకసారి ఇస్తే రెండు రోజులలో కొత్త రక్తం తయారవుతుందని, మనిషి తన జీవిత కాలంలో గరిష్టంగా 168 సార్లు రక్త దానం చేయొచ్చని తెలిపారు. అడ్వకేట్ సుమలత మాట్లాడుతూ రక్తాన్ని ఎక్కడైనా ఫ్యాక్టరీలలో కృత్రిమంగా తయారు చేయలేమని, అది మనిషి నుండే లభిస్తుందని అందుకే రక్తదానం చాలా గొప్పదని తెలియజేశారు. ఏపీఎస్ఎఫ్ శ్రీ సత్య సాయి జిల్లా కార్యదర్శి బండి శివ ఆధ్వర్యంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైట్ ప్రతినిధులు భాస్కర్, మెడికల్ ఆఫీసర్ నిఖిల్ ఆధ్వర్యంలో రక్త గ్రూపు నిర్ధారణ,రక్తదానంపై అవగాహన చేశారు. అనంతర రక్తదానం చేసిన దాతలకు 1లక్ష రూపాయలు ప్రమాద బీమా, ప్రశంస పత్రాన్ని, మెమెంటో, శాలువాలతో సత్కరించారు. రక్తదాతలకు పండ్ల రసం, బిస్కట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఏపీఎస్ఎఫ్ నాయకులు పవన్ కుమార్, హరి, రాము, దినేష్, స్వామి, పాల్గొన్నారు.

యూటీఎఫ్ రణభేరిని విజయవంతం చేయండి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రా రెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం : రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు, సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర విద్యారంగ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 వ తేదీ నుండి 19 తేది వరకు నిర్వహించే రణభేరిని విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయ చంద్రా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా కార్యదర్శి ఆర్. రామకృష్ణ నాయక్‌తో కలసి ధర్మవరం యుటిఎఫ్ జోన్ ఆధ్వర్యంలో రణభేరి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయచంద్రా రెడ్డి, రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ 12వ పిఆర్సి ఊసేలేదని, నూతన కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నప్పటికీ ఒక్క డీ.ఏ. కూడా ఇవ్వకపోగా వేలకోట్ల ఆర్థిక బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.ఇక విద్యాశాఖలో నిరంతరం "ఆన్‌లైన్.. అప్లోడింగ్ అంటూ బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని విమర్శించారు. విద్యాశక్తి కార్యక్రమాన్ని ఒకవైపు స్వచ్ఛందం అంటూనే మరోవైపు ఖచ్చితంగా కొనసాగించాలని ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. పరీక్షల మూల్యంకనాన్ని ఉపాధ్యాయులకే పరీక్షగా మార్చేశారని విమర్శించారు. ఉమ్మడి సర్వీసెస్ సమస్యను పరిష్కరించాలని బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం పట్టణ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జింక హరికృష్ణ, సాయి గణేష్, యూటీఎఫ్ నాయకులు రామకృష్ణ, లక్ష్మయ్య, రాంప్రసాద్, హెచ్.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభను విజయవంతం చేయండి..

– పల్లె సింధూర రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : అనంతపురంలో బుధవారం జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభకు పుట్టపర్తి నియోజకవర్గం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలి రావాలని శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రతి మండలం నుంచి బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గానికి 175 బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయా మండలంలో కూటమి నాయకులు సమన్వయంతో బస్సులలో కార్యకర్తలు, రైతులు, మహిళలు తరలిరావాలని కోరారు. అనంతపురం చరిత్రలో ఈ సభ నిలిచిపోయే విధంగా జరగాలని ఉమ్మడి అనంతపురం జిల్లా కూటమి నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారన్నారు.

రా.. కదలి రా...

విశాలాంధ్ర, తాడిమర్రి : ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో 10వ తేదీన అనంతపురంలో నిర్వహించనున్న "సూపర్ సిక్స్ - సూపర్ హిట్" సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వినర్ కుచి రాము పిలుపునిచ్చారు. మంగళవారం తాడిమర్రి మండల కేంద్రంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఇప్పటికే విజయవంతంగా అమలు చేసిందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పెన్షన్ల పెంపు, తల్లికి వందనం వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు. ఈ సభ ద్వారా ప్రభుత్వం సాధించిన విజయాలు, భవిష్యత్తు ప్రణాళికల గురించి ప్రజలకు తెలియజేయనున్నారు. ఈ చారిత్రాత్మక సభకు భారీ సంఖ్యలో ప్రజలు, ముఖ్యంగా మహిళలు హాజరై, తమ ఆశీస్సులను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎన్టి యూ సి జిల్లా ఉపాధ్యక్షులు ముంటి మడుగు హర్ష వర్ధన్ , వినోద్ కుమార్ , తెదేపా మండల నాయకులు అల్లే పక్కిర రెడ్డి , మాజీ ఎంపీటీసీ ఆకులేటి అశ్వర్థ నారాయణ గాలి పల్లి బాలాజీ నాయుడు గంగాధర రవీంద్ర రెడ్డి ,రంగయ్య , ఒబిలేసు, పాపా నాయుడు, బాస్కర్ గౌడ్, పక్కిరిగార్ల గణేష్, మురళి గౌడ్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి

ఎంపీపీ గొడ్డు మర్రి ఆదినారాయణ యాదవ్

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో రాష్ట్ర వైద్య, విద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు సమావేశం జరిగింది. బుధవారం అనంతపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరగబోయే సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభను విజయవంతం చేయాలని ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. కార్యకర్తలంతా క్రమశిక్షణతో వ్యవహరించి, నిర్ణీత సమయానికి ధర్మవరం గ్యాలరీ వద్ద హాజరుకావాలని సూచించారు. కేంద్ర మద్దతుతో రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేష్, డోల రాజారెడ్డి, మండల అధ్యక్షుడు అంజన్ రెడ్డి, బిజెపి నాయకులు, పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ సభను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర - నార్పల: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి సారిగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభను సక్సెస్ చేద్దామని జిల్లా టిడిపి నాయకులు అలం వెంకటనరసానాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో జిల్లా టిడిపి నాయకులు అలం వెంకటనరసానాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నార న్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరంలోనే ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దక్కుతుందన్నారు. పెన్షన్లు, డ్రిప్ ఇరిగేషన్, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీ శక్తి పథకం ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సంక్షేమ కార్యక్రమాలు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేపడుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషంగా ఉండారన్నారు.అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సభకు జిల్లాలో ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సూపర్ సిక్స్..సూపర్ హిట్ చేద్దాం తరలిరండి

టీడీపీ మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ

విశాలాంధ్ర-నార్పల : సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేద్దాం తరలి రావాలని మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం ఏర్పడ్డాక దాదాపు 75 శాతం అమలు చేయడంలో విజయం సాధించిందన్నారు .వృద్యాధప్య పింఛన్ రూ.3 వేల నుండి ఏకంగా 4 వేల రూపాయలకు ఒకేసారి పెంచడంతో పాటు సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు ,అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఆర్థిక సహాయం, తల్లికి వందనం పథకం ద్వారా కుటుంభంలో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అందరికి పథకం వర్తింపు చేయడం , శ్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంలో కూటమి ప్రభుత్వం సూపర్ హిట్టుకొట్టిందన్నారు . పదహారు వేల పైచిలుకు పోస్టులతో మెగా డీఎస్సీ ని నిర్వహించిన ఎన్నికల హామీని నిలబెట్టుకున్న ఘనత కూడా కూటమి ప్రభుత్వానికి దక్కుంతుదన్నారు. అంతే కాకుండా నియోజకవర్గాల వారీగా జాబ్ మేళాలు నిర్వహిస్తూ వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను, కూటమి ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. నగర శివార్లలోని జిఎంఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహించే సూపర్ సిక్స్ సూపర్ హిట్ భారీ బహిరంగ సభలో గౌరవ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటిసారి అనంతపురం జిల్లాకు డిప్యూటీ సీఎం హెూదాలో విచ్చేస్తున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటున్నారని.. తెలియజేశారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆహుడా చైర్మెన్ టి.సివరుణ్ ఆదేశాలమేరకు శింగనమల నియోజకవర్గ సమన్మయకర్త సూచనలతో మండల నుండి పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు, వీర మహిళలు, జనసైనికులు ,పవన్ కళ్యాణ్ అభిమానుకు , కూటమి నాయకులు తరలి వచ్చి "సూపర్ హిట్" చేయవలసిందిగా పిలుపునిచ్చారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘన స్వాగతం

విశాలాంధ్ర, గోరంట్ల : సూపర్ సిక్సు సూపర్ హిట్ కూటమి తరపున అనంత పురంలో జరుగుతున్న కార్యక్రమానికి విచ్చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కి గోరంట్ల మండలం లోని పాలసముద్రం క్రాస్ నందు మండల భారతీయ జనతా పార్టీ నాయకులు సత్యసాయి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ ఆధ్వర్యంలో మండలం లోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు,ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ, మేదర శ్రీనివాసులు, వెంకటాచలం, బజ్జంత్రీ శంకర, కాచెర్ల హరీష్ కుర్ర ఆంజనేయులు,, నాగరాజ్ యాదవ్, పాలసముద్రం అశ్వర్థ , హరినాథ్ రెడ్డి, దేవిస్వామి, జయరాం నాయక్, శేషు,రామాంజనమ్మ, పార్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన చెందొద్దు

విశాలాంధ్ర-గుడిబండ: మండల పరిధిలోని తాళ్ళకెర కు 280 బస్తాలు ముత్తుకూరు 140 బస్తాలు,శంకరగల్లు 140 బస్తాల యూరియా రైతు సేవ కేంద్రాలకు చేరినట్లు మంగళవారం మండల వ్యవసాయ అధికారి వీర నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులకు పంపిణీ చేస్తామని, మండలంలో రైతులందరూ యూరియా అందుబాటులో లేదని దిగులు చెందవద్దన్నారు. ఈనెల ఆఖరి వరకు యూరియా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో గుడిబండ ముత్తుకూరు తాళ్లకెర గ్రామాలలో రైతు సేవ కేంద్రంలో తహసిల్దార్ శ్రీధర్ చేతుల మీదుగా యూరియా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీర నరేష్ ఏఈఓ శారద మంజుల రైతు సేవ కేంద్ర అధికారులు ప్రసూన ఉమా, వీఆర్ఓ త్యాగరాజు స్వామి, రైతులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై సూచనలు

విశాలాంధ్ర-ఉరవకొండ: పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మోపిడి గ్రామాన్ని వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు సందర్శించి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. ముఖ్యఅతిథిగా కెవికె సైంటిస్టు కె. చంద్ర రాయుడు ఉద్యానవన శాఖ శాస్త్రవేత్త యుగంధర్, ఉరవకొండ ఏడిఏ హాజరై రైతులతో ముఖాముఖి మాట్లాడారు. వరి వేరుశనగ మొక్కజొన్న మిరప పప్పు శనగలాంటి పైర్లలో వచ్చే చీడపీడల నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణుడు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందిస్తాం..

- అధిక ఎరువల వినియోగంతో నష్టం
- మండల వ్యవసాయ అధికారి ముస్తఫా

విశాలాంధ్ర-ధర్మవరం: మండల వ్యవసాయ అధికారి ముస్తఫా మల్లాకాలువ, ఓబుల నాయన పల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రైతులకు న్యానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అధిక ఎరువుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను రైతులకు వివరించడం జరిగిందన్నారు. దర్శనమల, ఏలుకుంట్ల రైతు సేవ కేంద్రాలకు 6.3 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియా సరఫరా చేయడం జరిగింది అన్నారు. అలాగే ధర్మవరం కేంద్రంలోని ఎరువుల దుకాణాలకు సిఐఎల్ కంపెనీకి చెందినటువంటి 34 టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగింది అన్నారు. రైతులకు అవసరమైన జసరఫరా చేయడానికి అన్ని రకాల ప్రణాళికలు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. రైతు సోదరులు ఎటువంటి ఆందోళన లేకుండా ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా వినియోగంపై రైతు సేవా కేంద్ర సిబ్బంది ఔట్ రీచ్ కార్యక్రమం నిర్వహించినట్ల చెప్పారు. కార్యక్రమంలో గ్రామ రైతులు ఏఈఓ అశ్విని, వీఏఏ హేమంత్, సుమిత్ర, రాజేశ్వరి, నందిని తదితరులు పాల్గొన్నారు.